క్లుప్తంగా

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

– ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె సంబంధిత జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహించి సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. షుగర్ పరీక్ష చేయించుకోవాలనుకునేవారు పడగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. అలాగే ఆసుపత్రిలో నూతనంగా డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని, కిడ్నీ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

వైభవంగా కొత్త గంగమ్మ తిరునాల



ప్రత్యేక అలంకరణలో కొత్తగంగమ్మ అమ్మవారు

పెండ్లిమర్రి : మండలంలోని కారపురెడ్డిపల్లెలో వెలసిన శ్రీ కొత్తగంగమ్మ తిరునాల ఉత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అర్చకుల ఆధ్వర్యంలో గణపతి పూజ, ఆకు పూజ, పంచామృతాభిషేకం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చూట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కాయ కర్పూరాలతో అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అవరణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. ఎద్దులచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన ఎద్దులకు ఆలయ కార్యనిర్వాహకులు బహుమతులు అందజేశారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



శక్తి యాప్ గురించి వివరిస్తున్న పోలీస్ సిబ్బంది

జమ్మలమడుగు రూరల్ : తల్లిదండ్రులు బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యానేరమని పట్టణ ఎస్ఐ హైమావతి తెలిపారు. శనివారం స్థానిక సాయిపరమేశ్వర జూనియరు కళాశాలలో విద్యార్థినులకు శక్తి యాప్‌పై ఆమె అవగాహన సదస్సును నిర్వహించి మాట్లాడారు. సమాజంలో ఎక్కువగా సైబర్ క్రైమ్ నేరాలు జరుగుతున్నాయన్నారు. వాటి పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమైన సమస్యలు ఉంటే వెంటనే శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు.

చిత్ర లేఖనంలో రాణించిన విద్యార్థులు



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న హెడ్మాస్టర్, తదితరులు

వేంపల్లె : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం యోగాపై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఇన్‌చార్జి హెడ్మాస్టర్ శ్రీనివాసులరెడ్డి, డ్రాయింగ్ మాస్టర్ సురేష్‌కుమార్‌లు అభినందించారు. ఈ సందర్భంగా హెడ్మాస్టర్ మాట్లాడుతూ నైపుణ్యత ఉంటేనే ఆయా రంగాల్లో కూడా రాణించేందుకు వీలు ఉంటుందన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులను ప్రోత్సహించేందుకు వీలు ఉంటుందన్నారు.

ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు

బద్వేలు అర్బన్ : రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను సైతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ తెలిపారు. శనివారం స్థానిక సీపీఎం పట్టణ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సామాజిక భద్రతకు ముప్పు తెస్తున్న పాలకులు ఎన్నికల్లో ధనం, కులం, మతం ఆధారంగా గెలిచి ప్రజాసంక్షేమాన్ని, ప్రజా సేవను విస్మరిస్తున్నారన్నారు. ప్రజలందరికీ నిత్యావసర సరుకులు చౌకదుకాణాల ద్వారా అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.

నిత్య జీవితంలో యోగా తప్పనిసరి



పులివెందుల : నగరవనంలో యోగాసనాలు చేస్తున్న యోగాభ్యాసకులు



కమలాపురం : గురుకుల పాఠశాలలో యోగాసనాలు చేయిస్తున్న ట్రైనర్‌లు



జమ్మలమడుగులో యోగ చేస్తున్న అటవీశాఖ సిబ్బంది

పులివెందుల టౌన్ : నిత్య జీవితంలో ప్రతి ఒక్కరూ యోగా చేయడంవల్ల మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యం లభిస్తుందని, అందువల్ల యోగా తప్పనిసరిగా చేయాలని ఆర్డీఓ చిన్నయ్య తెలిపారు. శనివారం పట్టణంలోని స్థానిక వైఎస్సార్ క్రీడా ప్రాంగణంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్డీఓ హాజరై మాట్లాడుతూ ప్రతిరోజు యోగా భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పట్టణంలోని స్థానిక ఫుడ్‌అండ్ సైన్స్ కళాశాలలో, జెఎన్‌టీయూ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. స్థానిక నగరవనం(రాణితోపు) పార్కులో యోగా గురువు ఓంప్రకాష్ ఆధ్వర్యంలో యోగాసనాలపై అవగాహన కల్పించారు. లయోలా పాల్‌టెక్నిక్(వైఎస్ఆర్ఆర్) కళాశాలలో ప్రిన్సిపల్ బ్రిట్టో ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు యోగాసనాలు చేశారు. పట్టణంలోని స్థానిక ఎక్సలెంట్స్ నాగార్జున హైస్కూల్‌లో, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులతో యోగాసనాలు వేయించారు. అలాగే స్థానిక అర్బన్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ మురళీ నాయక్ ఆధ్వర్యంలో సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది యోగాసనాలు చేశారు. అలాగే ఏపీ కార్ల్, పీబీసీ, ఐసీడీఎస్, ఎంపీడీఓ, ఫైర్‌స్టేషన్, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయంలో యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

కమలాపురంలో..

కమలాపురం : స్థానిక బాలయోగా గురుకుల పాఠశాల/ కళాశాలలో మండల స్పెషలాఫీసర్ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ గౌస్‌బాషా ఆధ్వర్యంలో యోగాసనాలు చేయించారు. అలాగే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మున్సిపల్ శాఖ సహకారంతో, డీసీసీ బ్యాంక్‌లో సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ ఆఫీసర్ నాగరత్నమ్మ, సీనియర్ ఇన్స్‌పెక్టర్ వెంకటసుబ్బయ్య, డీసీసీబీ చీఫ్ మేనేజర్ వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో యోగాసనాలు చేశారు. అలాగే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో యోగాసనాలు చేశారు. ట్రైనర్లు యోగా ట్రైనర్లు షాకీర్ హుసేన్, మాధురి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో శారీరక, మానసిక ఉల్లాసం కోసం, ఆరోగ్యం కోసం, యోగా చేయాలన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : ఎన్ఎస్ఎస్ యూనిట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో యోగాసనాలు చేశారు. స్థానిక వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ, కందుల ఐటీఐ కళాశాలలో, ఉషా కిరణ్ ఉన్నత పాఠశాల, స్వామి వివేకానంద పాఠశాలలో అలాగే మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో యోగా దినోత్సవ వేడకలు నిర్వహించారు. కార్యక్రమాలలో ఎంపీడీఓ కుళాయమ్మ, ఎంఈఓ స్టాలిన్, వెంకట రామిరెడ్డి, ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఏపీఎస్ కుమార్‌స్వామి గుప్తా, ఆయా పాఠశాలల హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేములలో..

వేముల : మనిషి ఆరోగ్యానికి యోగా ఎంతో అవసరమని యురేనియం ప్రాజెక్టు జీఎం సుమన్ సర్కార్ తెలిపారు. మండలంలోని యూసీఐఎల్ కాలనీలో యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని అధికారులతో కలిసి యోగా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రయంలో యురేనియం అధికారులు కిశోర్ భగవత్, పీకే నాయక్, శ్రీకాంత్, ఏపీఎస్పీ వాసుదేవారెడ్డి, హుస్సేనయ్య పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : మండలంలో శనివారం యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని బాలయోగి ప్రతిభా గురుకుల పాఠశాల ఆవరణలో విద్యార్థులు, అధికారులు యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యాప్తంగా 99 కేంద్రాలలో యోగాను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ ఈశ్వరయ్య, ఎంఈఓ రామకృష్ణ, డాక్టర్ సుభాషిణి, పాఠశాల ప్రిన్సిపాల్ తులశమ్మ, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : యోగాతోనే ఆరోగ్య రక్ష అని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి అధికారులు, విద్యార్థులు యోగాసనాలు వేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి వారు యోగాపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ మురళీధర్, తహసీల్దార్ సాయినాథరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ హరిబాబు, ఏపీఎం మంజునాథ, మండలస్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని అన్ని సచివాలయాలు, ప్రభుత్వ పాఠశాలల్లో యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహించారు. అధికారులు, ప్రజలు, విద్యార్థులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని యోగాసనాలు వేశారు. ఎంపీడీఓ కుల్లాయిబాబు మండల వ్యాప్తంగా జరిగిన కార్యక్రమాలను పర్యవేక్షించారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణ, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలల్లో యోగ నిర్వహించారు. ముఖ్యంగా పట్టణంలోని కోర్టు పరిధిలో, మండల కార్యాలయాల్లో, గండికోట రహదారిలో ఉన్న అటవీశాఖ అధికారులు యోగా చేశారు. ఈ సందర్భంగా యోగా గురువు లక్ష్మీరాజా యోగ అసనాలు వేయించారు. ప్రతి ఒక్కరు కచ్చితంగా ప్రతిరోజు యోగకు సమయాన్ని కేటాయించాలని సూచించారు.

చక్రాయపేటలో..

చక్రాయపేట : మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలు, పాఠశాలలు, కళాశాల విద్యార్థులు గండి దేవస్థానం వద్ద యోగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయం ఏవో వెంకటరమణ, తహసీల్దారు విజయకుమారి, పంచాయతీ కార్యదర్శి విజయకుమార్, చక్రాయపేట సర్పంచ్ హర్షాద్ అయ్యూబ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తహసీల్దార్ రామచంద్రుడు విద్యార్థులతో కలిసి యోగాసనాలు వేశారు. పీఎం నరేంద్రమోదీ యోగా దినోత్సవాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు రమణ, రాజేశ్వరి, డీటీ రామకృష్ణారెడ్డి, విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : మండలపరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు యోగాసనాల్లో పాల్గొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాల మైదానంలో మండలంలోని ప్రభుత్వ అధికారులు, యోగ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : మండలంలోని అన్ని పాఠశాలు, కళాశాలల్లో విద్యార్థులు, గ్రామసచివాలయ ఉద్యోగులు యోగా వేడుకలల్లో పాల్గొన్నారు. పెండ్లిమర్రి ప్రభుత్వ జూనియర్ కళాశాల, వెల్లటూరు హైస్కూల్‌లో నిర్వహించిన యోగాలో ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, తహసీల్దార్ అనురాధ, ఎంఈఓ సుజాతలు యోగా గురించి వివరించారు.

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : మండలంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ పాఠశాలలలో యోగా దేని ఘనంగా నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులు, పత్రికా విలేకరులు, సచివాలయ సిబ్బంది వేడుకల్లో పాల్గొన్నారు.

నాగరికతకు చిహ్నాలు గ్రంథాలయాలు



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ఈశ్వర్‌రెడ్డి

వీరపునాయునిపల్లె : నాగరితకు గ్రంథాలయాలు చిహ్నాలు అని యోగివేమన విశ్వవిద్యాలయ ఆచార్యులు, అరసం కడప జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఈశ్వర్‌రెడ్డిలు తెలిపారు. శనివారం మండలంలోని ఉరుటూరు గ్రామంలో వికాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ రజనీకాంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతను విజ్ఞానవంతులను చేయాలన్న సంకల్పంతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, యోగివేమన విశ్వవిద్యాలయ వృక్ష శాస్త్ర అధ్యాపకులు రాజగోపాల్‌రెడ్డి, ఉరుటూరు గ్రామాభివృద్ధి సభ్యులు తిరుమల్‌రెడ్డి, మురలీధర్‌రెడ్డి మరియు విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కండీషన్ లేని బస్సులపై తనిఖీలు నిర్వహించాలి



జిల్లా రవాణా శాఖ ఇన్‌చార్జి అధికారి నిరంజన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

చింతకొమ్మదిన్నె : కండిషన్ లేని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులపై రవాణా శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాటిని సీజ్ చేయాలని కడప జిల్లా రవాణా శాఖ ఇన్‌చార్జి అధికారి నిరంజన్‌రెడ్డికి శనివారం పీడీఎస్‌యూ నాయకులతో కలసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంకన్న మాట్లాడుతూ జిల్లాలోని వివిధ కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు డొనేషన్ల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేస్తూ, మరోవైపు బస్సుల ఫీజుల పేరుతో తక్కువ కిలోమీటర్ల గాను వేలాది రూపాయలు వసూలు చేస్తూ విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విద్యార్థుల భద్రత కాపాడాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు మహేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కమనీయం శ్రీనివాసుడి కల్యాణం



శ్రీమహాలక్ష్మి గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటంరోడ్డులోని ఫైర్ ఆఫీసు వెనుకభాగంలో ఉన్న శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ దశమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఆలయ ఆవరణలో నిర్వహించిన పద్మావతి, గోదాదేవి వేంకటేశ్వరస్వామి కల్యాణం కమనీయంగా సాగింది. స్వామివార్ల కల్యాణం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

దరఖాస్తులకు ఆహ్వానం

జమ్మలమడుగు : పులివెందుల, జమ్మలమడుగు, మైదుకూరు ప్రాంతాల్లో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఖాళీ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని కన్వీనర్, జమ్మలమడుగు బీసీ వేల్ఫేర్ ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి పార్టైం గెస్టు టీచర్ల పోస్టులకు ఖాళీగా ఉన్నాయని ముఖ్యంగా జమ్మలమడుగులో పీజీటీ జీవశాస్త్రం, సోషల్ సబ్జెక్టులకు, మైదుకూరు నియోజకవర్గంలోని వనిపెంటలో ఇంగ్లీషు, పులివేందుల నియోజకవర్గంలోని తొండూరు వ్యాయమ ఉపాధ్యాయురాలు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఈనెల 30వ తేదీలోపు జమ్మలమడుగు పట్టణంలోని రామిరెడ్డిపల్లె దారిలో ఉన్న గురుకుల పాఠశాలల్లో సాయంత్రం ఐదుగంటలలోపు అందించాలన్నారు.

మట్కా బీటర్ల అరెస్టు

వేంపల్లె : మండలంలోని నాగూరు గ్రామంలో మట్కా ఆడుతున్న 5 మంది మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు సీఐ నరసింహులు తెలిపారు. మట్కా బీటర్ల వద్ద నుంచి రూ.8 వేల నగదును స్వాధీనం చేసుకుని మట్కా స్లిప్పులను కూడా తీసుకున్నట్లు తెలిపారు. అందిన సమాచారం మేరకు మట్కా బీ టర్లపై దాడులు చేయడంతో మట్కా రాస్తున్న నాగూరు గ్రామానికి చెందిన చంద్రశేఖర్, నాగ య్య, కొండా దుగ్గిరెడ్డి, కొమెర వెంకటరమణ వేంపల్లెలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన వల్లెపు వెంకటేష్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

24న ద్విచక్రవాహనాల వేలం పాట

బద్వేలు అర్బన్ : వివిధ కేసులలో పట్టుబడిన మూడు ద్విచక్రవాహనాలకు ఈనెల 24న వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ బి.సీతారామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దవటం రోడ్డులోని మార్కెట్ యార్డు కాంపౌండ్‌లోని ఎక్సైజ్ స్టేషన్‌లో 11.30 గంటలకు వేలం పాటలో పాల్గొనదలచిన వారు రుసుమును చెల్లించి తమ పేరును నమోదు చేసుకోవాలని తెలిపారు.

దివ్యాంగులకు నిత్యావసర సరుకుల పంపిణీ



దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్న సంధ్యారెడ్డి, తదితరులు

పులివెందుల : పట్టణంలోని స్థానిక వికలాంగుల కమ్యూనిటీ భవనంలో శనివారం గుప్తా మెడికల్స్ యజమాని మేడా నరసింహులు గుప్తా వర్ధంతిని పురష్కరించుకుని ఆయన కుమారుడు దినేష్‌గుప్తా, కుటుంబ సభ్యులు దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఔషధ నియంత్రణ అధికారి సంధ్యారెడ్డి ఆర్య వైశ్య సంఘం సభ్యులతో కలిసి దివ్యాంగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, రోటేరియన్ బింగి రామ్మోహన్, జగదీష్ మెడికల్స్ రాజా, అవోపా అధ్యక్షుడు మేడా సాయిబాబా, సత్యసాయి సేవాసమితి సుబ్రమణ్యం, జనార్ధన్, శివ, పగడాల సురేంద్రబాబు, బాబ్ జాన్, వాసవీ క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి



కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

జమ్మలమడుగు రూరల్ : ఈ ఏడాది పాలీసెట్‌లో నిర్వహించిన ఎంపిక ప్రక్రియకు అర్హత సాధించిన విద్యార్థులు కౌన్సిలింగ్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రవికుమార్ తెలిపారు. శనివారం మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ ప్రక్రియను ఆయన అధ్యాపకులతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జమ్మలమడుగు పాలిటెక్నిక్ కళాశాలలో మొదటి సారి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించారు. కౌన్సెలింగ్ ప్రక్రియ ఈనెల 28వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజర్ కావాలని ఆయన సూచించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



పి.బొమ్మెపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ

జమ్మలమడుగు : గ్రామీణ ప్రాంతాల ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అర్బన్ సీఐ లింగప్ప తెలిపారు. శనివారం పి.బొమ్మెపల్లిలో సైబర్ నేరాలు, సోషల్ మీడియా ప్రభావాలపై గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ఆయన అవగాహన సదస్సును నిర్వహించి మాట్లాడారు. సెల్ ఫోన్ల ద్వారా సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. వాట్సాప్‌లలో వచ్చె మేసేజ్‌లను ఏదీ పడితే అది నొక్కడం ద్వారా మీకు తెలియకుండానే మోసపోయే ప్రమాదం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామాలు వదిలిపోయేటప్పుడు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

సంక్షేమ హాస్టల్ నిర్మించారు.. గాలికి వదిలేశారు..!

- రూ.2 కోట్లతో నూతనంగా నిర్మించిన బీసీ బాలికల హాస్టల్
- వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు ఆవేదన
- విద్యుత్తు కనెక్షన్ కూడా ఇవ్వలేని వైనం
- హాస్టల్‌ను ఎత్తివేయాలని ఆలోచనలో కూటమి ప్రభుత్వం
- విద్యార్థులకు తప్పని అవస్థలు



వేంపల్లెలో నిరుపయోగంగా ఉన్న బీసీ బాలికల సాంఘిక సంక్షేమ హాస్టల్

వేంపల్లె : కూటమి ప్రభుత్వం, పాలకుల నిర్లక్ష్యం కారణంగా వేంపల్లె పట్టణంలోని నూతనంగా నిర్మించిన బీసీ సాంఘిక సంక్షేమ వసతి గృహం నిరుపయోగంగా మారింది. గతంలో చంద్రబాబునాయుడు హయాంలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలను గాలికొదిలేశారు. ఏ భవనం చూసినా విరిగిన కిటికీలు, దుర్గంధం వెదజల్లే మరుగుదొడ్లు, పెచ్చులూడే శ్లాబ్‌లే దర్శనమిచ్చేవి. నీటి వసతి కూడా అంతంత మాత్రంగానే ఉండేది. దీనివల్ల ఇక్కడుండే బీసీ విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. సీఎంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన ఏడాదిలోనే వసతి గృహాల్లోని సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టారు. వసతి గృహాలన్నీ కళకళలాడుతుండేవి. పేద విద్యార్థులు బాగా చదువుకుని గొప్ప ప్రయోజకులు కావాలనే ఉద్దేశంతో పట్టణంలోని వైఎస్ వివేకానందరెడ్డి నగర్‌లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.2 కోట్లతో బీసీ సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని నిర్మించారు. అత్యాధునిక పద్ధతిలో వసతి భవనాలు, మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో వాటిని గాలికి వదిలేశారు. కూటమి ప్రభుత్వం, స్థానిక నాయకుల నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో పేద విద్యార్థులు ఆక్కడ చేరడం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సుమారు ఏడాది గడిచినా వినియోగంలోకి తీసుకరావడంలో మాత్రం అటు సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు, ఇటు పాలకులు దృష్టి సారించకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత ఏడాది విద్యార్థులు ఉన్నా.. విద్యుత్తు కనెక్షన్ లేకపోవడంతో వెళ్లిపోయారు. ఈ ఏడాది అలాగే చేస్తే విద్యార్థులు రాలేదని సాకుతో బీసీ సంక్షేమ హాస్టల్‌ను కూటమి ప్రభుత్వం ఎత్తివేయాలని అలోచనలో ఉన్నట్లు పలువురు ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో ఇక్కడ బాలురకు హాస్టల్ వసతి కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఈ భవనాలకు బాలుర వసతి గృహం అని ముఖ ద్వారం వద్ద పేరు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం బాలికలకు ఆ హాస్టల్‌ను కేటాయించినా.. పేరు మాత్రం బాలుర వసతి గృహంగా పేరు అలాగే ఉండటం గమనార్హం. కనీసం వసతి గృహం పేరు కూడా మార్పు చేయలేదంటే ఈ హాస్టల్‌పై ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో దీన్ని బట్టి అర్థమవుతోంది.

అన్ని హంగులతో వసతి భవనాలు

పేద విద్యార్థులకు మంచి విద్యనందించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలనే సదుద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయల వ్యయంతో బీసీ సాంఘిక సంక్షేమ హాస్టల్‌ను నిర్మించారు. మంచి ఆహ్లాదమైన వాతావరణంలో వసతి భవనాలు, గాలి వెలుతురు తగిలేటట్టు కిటికీలు, టాయిలెట్స్, చుట్టూ కాంపౌండ్ వాల్, మౌలిక వసతులను ఏర్పాటు చేశారు. అలాగే ఒక అటెండర్, వంట చేసేందుకు కుక్, ఒక వాచ్‌మెన్‌ను నియమించారు. త్రీఫేస్ విద్యుత్ కనెక్షన్ కోసం అధికారులు ఎస్టిమేషన్ వేసి ప్రభుత్వానికి పంపారు. రూ.3.34లక్షలు కడితే విద్యుత్ కనెక్షన్ ఇస్తామని అధికారులు తెలియజేశారు. అయితే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో అధికారులు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. ప్రస్తుతం పేద విద్యార్థులు ఉండేందుకు సింగిల్ ఫేస్ విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలని హాస్టల్ ఇన్‌ఛార్జి వార్డెన్ నాగ సుబ్బమ్మ విద్యుత్ అధికారులకు అర్జీ పెట్టుకున్నారు. అందుకోసం రూ.22వేలు చెల్లించాలని చెప్పారు.

హాస్టల్ లేక ఇబ్బందులు పడుతున్నాం



మా తల్లిదండ్రులు యోగాంజనేయులు, చందు కూలి పని చేసుకుంటూ వేంపల్లె జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదివిస్తున్నారు. రెక్కాడితే కానీ.. డొక్కాడని పరిస్థితి మాది. అలాంటి పరిస్థితుల్లో మా తల్లిదండ్రులు హాస్టల్‌లో చేర్పించాలని అనుకున్నారు. అయితే ఇక్కడ హాస్టల్ ఉన్నా విద్యుత్ సరఫరా లేకపోవడంతో వెళ్లాలంటే భయమేస్తుంది.

– గౌతమి, 7వ తరగతి విద్యార్థి, వేంపల్లె

విద్యుత్ సరఫరా అందించి వాడుకలోకి తీసుకురావాలి



బీసీ సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో అధికారులు విద్యుత్ సరఫరాను అందించి వాడుకలోకి తీసుకురావాలి. ఈ ఏడాది కూడా కూటమి ప్రభుత్వం విద్యుత్ సరఫరా ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో కోట్ల రూపాయల ప్రభుత్వ ధనంతో నిర్మించిన హాస్టల్ భవనాన్ని నిరుపయోగంగా మారకూడదు. అధికారులు, స్థానిక అధికార పార్టీ నాయకులు తగిన చర్యలు తీసుకోవాలి.

– కళ్యాణి, 8వ తరగతి, తాళ్లపల్లె

రెండు, మూడు రోజుల్లో విద్యుత్ సరఫరా అందిస్తాం

విద్యుత్ అధికారులతో రూ.3.34లక్షల ఖర్చు అవుతుందని ఎస్టిమేషన్ వేయించి ప్రభుత్వానికి నివేదిక పంపాం. అయితే ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు రాలేదు. కనీసం సింగిల్ ఫేస్ మీటర్ బిగించి విద్యుత్ సరఫరా చేయాలని అధికారులకు అర్జీ పెట్టుకున్నాం. అందుకు రూ.22వేలు చెల్లించాలని చెప్పారు. త్వరలో అందుకు సంబంధించిన అమౌంటును చెల్లించి రెండు, మూడు రోజుల్లో విద్యుత్ సరఫరా అందిస్తాం.

– నాగ సుబ్బమ్మ, హాస్టల్ ఇన్‌చార్జి వార్డెన్, పులివెందుల